క్లుప్తంగా

మానవ హక్కులకు భంగం కలగొద్దు



చిన్నారికి పెన్ను అందజేస్తున్న రాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): సమాజంలో మానవ హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లె రాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మానవ హక్కుల వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ , పళ్ల పంపిణీ చేశారు. హెచ్‌ఎం సురేశ్ కుమార్, ఉపాధ్యాయులు లలిత, సునీత, వాణి, నాగమణి, వరప్రసాద్, సభ్యులు శంకర్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శికి ఉత్తమ అవార్డు



జాదవ్‌కు అవార్డు అందజేస్తున్న డీపీఓ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకొన్నారు. కలెక్టర్ మనూచౌదరి, డీపీఓ దేవకీదేవి చేతు మీదుగా మంగళవారం ఆ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమంలో చురుగా పాల్గొని విజయవంత చేసినందుకు, స్వచ్ఛ భారత్‌లో తడి,పొడి చెత్త వేరుచేసి వర్మికంపోస్ట్ తయారు చేసినందుకు ఈ అవార్డుకు పొందినట్లు చెప్పారు.

తండా ప్రజలకు మేలు



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి

నంగునూరు(సిద్దిపేట): తాము చేసిన కృషి ఫలితంగా నూతనంగా ఏర్పాటైన జేపీ తండాకు రేషన్‌షాపు మంజూరైందని మాజీ సర్పంచ్ బుక్యా భిక్షపతినాయక్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన రేషన్‌షాపును మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంఈఓ దేశిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ జయసూర్య, పంచాయతీ కార్యదర్శి అమర్, నాయకులు లక్ష్మణ్ నాయక్, లక్ష్మారెడ్డి, భాస్కర్, కనకయ్య, బాలరాజు, లాలు, రవి, రమ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

నంగునూరు(సిద్దిపేట): క్రీడల్లో మెలకువలు నేర్చుకొని చక్కగా రాణించాలని ఎంపీడీఓ లక్ష్మణప్ప, తహసీల్దార్ సరిత పిలుపునిచ్చారు. నంగునూరులో సీఎం కప్ క్రీడోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ మండల స్థాయి వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆసిఫ్, ఎంఈఓ దేశిరెడ్డి, ప్రిన్సిపాల్ కిషన్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, పీఈటీలు పాల్గొన్నారు.

అండగా నిలుస్తాం..



ఆర్థిక సహాయం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): పొదుపు సంఘంలో చేరిన సభ్యులకు ఆపద కాలంలో అండగా నిలుస్తామని పురుషుల పొదుపు సంఘం మండలాధ్యక్షుడు కడారి తిరుపతిరెడ్డి అన్నారు. నర్మేటలో ఇటీవల మరణించిన కొండ రాజు కుటుంబ సభ్యులకు మంగళవారం సామూహిక నిధి, విపత్ సహాయం, బోనస్ కలిపి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీడీఎఫ్ అధికారి రేణుక, అధ్యక్షుడు బాలయ్య, పరశురాములు, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి మ్యాథ్స్ టెస్ట్

గజ్వేల్‌రూరల్: జిల్లా స్థాయి మాథ్స్ టాలెంట్ టెస్ట్‌ను బుధవారం నిర్వహించనున్నట్లు టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ కొడకండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ చూపిన 9 మందిని 18న హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపిక చేస్తామని చెప్పారు. టీఎంఎఫ్ జిల్లా జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

● పెరిగిన భూగర్భ జలాలు ● యాసంగిలో సాగుకు సిద్ధం ● పనుల్లో నిమగ్నమైన రైతులు



నారుమడి సిద్ధం చేస్తూ..

చిన్నకోడూరు(సిద్దిపేట): వానాకాలంలో సాగుచేసిన మొక్కజొన్న, వరి పంటలు పూర్తి కావడంతో రైతులు యాసంగిలో వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. వరి పంటకు నీళ్లు పుష్కలంగా అందుతాయని రైతులు అంటున్నారు. నీళ్లు సమృద్ధిగా ఉండటంతో ఎక్కువగా వరి సాగు చేయడానికి నారు మళ్లు సిద్ధం చేస్తున్నారు.

70 శాతం వరి సాగుకు సన్నద్ధం

మండలంలో ప్రధానమైన రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఉండటంతో గ్రామాల్లో చేరువులు కుంటలు నీటితో నిండాయి. మండలపల్లి వాగు చెక్ డ్యామ్‌లలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో సాగునీరుకు ఢోకా ఉండదని రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే 70శాతం మంది రైతులు సాగు పనుల్లోనిమగ్నమయ్యారు.

16, 500ఎకరాల సాగు

మండలంలో 29 వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. ఈ వానకాలంలో 18, 950ఎకరాల్లో వరి సాగు కాగా, యాసంగిలో 16, 500ఎకరాలు సాగు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు అధికారుల రికార్డుల్లో ఉంది. అలాగే 400ఎకరాల్లో కూరగాయలు, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన భూగర్భ జలాలు..

వ్యవసాయ అధికారులు ముందస్తుగా గ్రామాల్లో యాసంగి సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ యేడాది భూగర్భ జలాలు పెరగడం, నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందనే ధీమాతో వరిసాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారని పలువురు రైతులు చెప్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నాం. అంతేకాకుండా కూరగాయలు, మొక్కజొన్న సాగు చేయాలని వివరిస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

– జయంత్ కుమార్, ఏఓ

స్వచ్ఛత, తాగునీటికి కార్యాచరణ

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



కార్మికులతో కలెక్టర్ మనుచౌదరి అధికారులు

సిద్దిపేటరూరల్: జిల్లాలో తాగునీరు, స్వచ్ఛత, మరుగుదొడ్లు అవసరమైన ప్రదేశాలను గుర్తించి వెంటనే కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం పలువురు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. డీఆర్‌డీఏ, స్వచ్ఛ్ భారత్ మిషన్ ద్వారా నవంబరు 19నుండి డిసెంబరు 10వరకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో మరుగుదొడ్లను అందంగా అలంకరించుకున్న వారికి ఈ సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం మానవహక్కుగా గుర్తించారన్నారు. అందులో భాగంగా ప్రజలందరికీ పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. వారోత్సవాలను క్షేత్రస్థాయిలో నిర్వహించిన అధికారులు, సహకరించిన ప్రజలను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, పంచాయతీ అధికారి దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాల పెంపకంపై అవగాహన

లోడి సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి



అవగాహన కల్పిస్తున్న బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): వ్యవసాయ క్షేత్రాల్లో కొంత స్థలంలో గడ్డి విత్తనాలు పెట్టడంతో పశువులకు మేత కొరత తీరుతుందని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టున కో–ఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. అక్కన్నపేట మండలం గండిపల్లి పరిధిలోని పంచరాయితండాలో మంగళవారం గడ్డివిత్తనాల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించు కోవాలన్నారు. వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం కోసం పాడిపరిశ్రమ, కోళ్లను పెంచాలని సూచించారు. ఆయన వెంట మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, కనకం, రవీందర్ మూడావత్ తిరుమల, బిచ్చనాయక్, రమేశ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న మహేశ్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఆశా కార్యకర్తలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ముందుస్తు చర్యగా పలువురు కార్యకర్తలను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సిద్దిపేటరూరల్/మిరుదొడ్డి(దుబ్బాక)/మద్దూరు(హుస్నాబాద్)/కోహెడరూరల్(హుస్నాబాద్)/దుబ్బాకటౌన్: సిద్దిపేటరూరల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హమీల్లో భాగంగా ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్టు చేయడం దారుణమని, అరెస్టు చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలన్నారు. మద్దూరులో సీపీయం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి మాట్లాడుతూ ఆశా కార్యకర్తల అరెస్టు అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో పాకాల జయ, మణెమ్మ, మంజుల తదితరులు ఉన్నారు. మిరుదొడ్డి, భూంపల్లి పోలీసులు ముందుస్తు చర్యగా పలువురు ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకుని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. కోహెడరూరల్‌లో ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుబ్బాకటౌన్ మండలం రాయపోల్ పోలీస్ స్టేషన్లో రాయపోల్, దౌల్తాబాద్ మండలాల ఆశా వర్కర్లు మాట్లాడారు. 20యేళ్ల నుంచి పనిచేస్తున్నా కనీస వేతనం లేదని వాపోయారు. యాదమ్మ, రజిత, భాగ్యలక్ష్మి, కవిత, జ్యోతి, బాలమణి, కౌసల్య, సుకన్య, రజిత లావణ్య, సుల్తానా, షాహిదా బేగం, కనక లక్ష్మి, మంజుల, సౌజన్య, లక్ష్మి, భాగ్య పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



కొండపాకలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్)/కొమురవెల్లి(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకటౌన్: జిల్లావ్యాప్తంగా అన్నిమండాల్లోను సీఎం కప్ క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కొండపాకలోని వేదా ఇంటర్నేషనల్ పాఠశాలలో క్రీడలను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ దిలీప్‌నాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు లింగారావు, పీడీలు భాస్కర్‌రెడ్డి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాల, చేర్యాల సాంఘిక సంక్షేమ పాఠశాలలో అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాస వర్మ, ఏఈఓ రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడోత్సవాలను మండల ప్రత్యేర అధికారి గణేశ్ ప్రారంభించారు. ఎంఈఓ ప్రవీణ్‌బాబు, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఎంపీఓ ఎండీ జహూరొద్దీన్, హెచ్‌ఎం వెంకట రాజలింగం, పంచాయతీ కార్యదర్శి పహీం, పీడీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ పోటీలను ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ ప్రారంభించారు. ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీఓ దయాకర్, సీనియర్ సహాయకులు రాజశేఖర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో సీఎం కప్ పోటీల ఆట స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ సంజీవ్ కుమార్, సీఐ శ్రీనివాస్‌తో కలిసి ఎంపీడీఓ భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ పరిశీలించారు. బుధవారం 18 టీంలు టోర్నీలో పాల్గొంటాయన్నారు. ఎంపీఓ నరేందర్ రెడ్డి, పీఈటీలు రవీందర్, శైలజ తదితరులున్నారు. అక్కన్నపేట ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం క్రీడాపోటీలను ఎంపీడీఓ భానోతు జయరాం ప్రారంభించారు. ఎంఈఓ రంగ నాయక్, నాయకులు సంజీవ్‌రెడ్డి, సాంబరాజు, కైలునాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట నర్సయ్య, ఓం ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



కె.అర్చన



బి.జస్వంత్

తొగుట(దుబ్బాక): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం నయీమా కౌసర్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో 9, 10వ తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో తమ విద్యార్థులు బి.జస్వంత్, కె.అర్చన పాల్గొని ప్రతిభ కనబర్చారన్నారు. రాష్ట్రస్థాయిలో పాల్గొనేలా శిక్షణనిచ్చిన పీఈటీ కనకయ్యను ఆమె అభినందించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 23మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.31వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రారంభం



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలేదీక్షల అనంతరం ఉద్యోగులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హమీ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ మార్పు ఆత్మగౌరవంపై దాడే

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహాన్ని మార్చడం అంటే తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవంపై దాడి చేయడమేనన్నారు.



గజ్వేల్: నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు



చిన్నకోడూరులో ..



మద్దూరు(హుస్నాబాద్): లద్నూలులో..



నంగునూరులో..

కాండం తొలుచుపురుగు నివారణకు చర్యలు

ఏఈఓ నాగార్జున



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ నాగార్జున

తొగుట(దుబ్బాక): యాసంగిలో వరి సాగుచేస్తున్న రైతులు కాండం తొలుచుపురుగు సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ నాగార్జున సూచించారు. మండలంలోని బండారుపల్లికి చెందిన రైతు కోక సుధాకర్‌రెడ్డి సాగుచేసిన వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు తల్లి రెక్కల పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. పురుగు నివారణకు దీపపు ఎరా (సోలార్ లైట్ ట్రాప్)ను పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. పిలక దశ కంటే కంకిదశలో ఈ పురుగు పంటను తీవ్రంగా నష్ట పరుస్తుందన్నారు. ప్రారంభ దశలోనే తల్లి పురుగును నివారిస్తే నష్టపోకుండా ఉండొచ్చని చెప్పారు. రైతులు మల్లయ్య, నర్సింహులు, లింగం, సందరి సత్యం పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి నాగపురి విద్యార్థులు

చేర్యాల(సిద్దిపేట): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జీవశాస్త్ర ప్రతిభ టాలెంట్ టెస్టు పోటీలలో నాగపురి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.పూజిత, ఎస్.సంధ్య జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ , నిరుపమ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కానిస్టేబుళ్ల మృతికి సంతాపం**

సిద్దిపేటఅర్బన్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుళ్లు మృతి చెందడం బాధాకరమని రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజులు అన్నారు. సిద్దిపేట శివారులోని అసోసియేషన్ భవనం వద్ద మంగళవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కానిస్టేబుళ్లు నవీన్, వెంకటేశ్, పరందాము తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వహించడంలో ఆదర్శంగా ఉండేవారన్నారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటాద్రి, మల్లయ్య, చంద్రయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీ**

నంగునూరు(సిద్దిపేట): చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ కిషన్‌కు డీఐఈఓ రవీందర్ సూచించారు. మంగళవారం నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీచేసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల పురోగతి, సెలబస్, పరీక్షల ప్రిపరేషన్‌పై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో నంగునూరు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలన్నారు.

◆ **రూ.25 వేల ఆర్థిక సహాయం**

ములుగు(గజ్వేల్): స్థానిక చాకలి నర్సమ్మ కూతురు వివాహం కోసం ఏ టు జెడ్ ఫౌండేషన్ చైర్మన్ జుబేర్‌పాష మంగళవారం రూ.25వేల సహాయం అందజేశారు.

◆ **నాణ్యతలో రాజీపడొద్దు**

దుబ్బాకటౌన్: పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఏ మాత్రం రాజీపడొద్దని తహసీల్దార్ సంజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం లచ్చపేట మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు.

◆ **అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి కృషి**

దుబ్బాక: పట్టణంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషిచేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రూ.1,11,116 అందించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున మొదటి విడతగా రూ.10లక్షలు, రెండో విడతలో మరో రూ.10లక్షలు మంజూరు చేయిస్తానన్నారు.

◆ **పండుగ సాయన్న వర్ధంతి**

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పండుగ సాయన్న 134వ వర్ధంతిని మండల పరిధిలోని మల్లుపల్లిలో ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయన్న ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం సభ్యులు మల్లేశం, శ్రీనివాస్, రాములు, మల్లయ్య, చంద్రం, కిరణ్, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ**

కొండపాక(గజ్వేల్): ఖమ్మంపల్లి గ్రామానికి ఉప్పరి పరశురాములు, కనకయ్యల పేరిట మంజూరైన రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఆసరాగా నిలుస్తోందన్నారు.

◆ **గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన**

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినులపై చెడుగా ప్రవర్తిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ శారద, షీటీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **14న జిల్లా మహాసభలు**

చేర్యాల(సిద్దిపేట): సిద్దిపేటలో 14న జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. హుస్నాబాద్ డివిజన్ మహాసభ రాములు అధ్యక్షతన పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగింది. మధు, సుధాకర్, అశోక్, భగవాన్‌రెడ్డి, భూపతిరాజు, శ్రీధర్, చందు తదితరులు పాల్గొన్నారు.

◆ **వైద్య పరికరాలు అందజేత**

దుబ్బాక: ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ సౌకర్యంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. డీడీఎఫ్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి పల్స్ ఆక్సీ మీటర్‌లో పాటు పలు వైద్య పరికరాలను డాక్టర్ అరుణకు అందించారు. కార్యక్రమంలో రాజేశ్, లింగం తదితరులు ఉన్నారు.